క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానించిన దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: తహసీల్దార్ ముంతాజ్‌ను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్ నాయక్ ఘనంగా సన్మానించారు. బుధవారం ఆయన తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి మాట్లాడారు. జెడ్పీటీసీగా ఉన్న సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని నిర్మించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, నాయకులు పాండునాయక్, బీక్యానాయక్ తదితరులు ఉన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోండి



ఎంఈఓ పాండుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ పాండుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. లెనోరా ప్రైడ్ స్కూల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నితిన్, మల్లేశ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

బోడకొండలో వీధి దీపాల ఏర్పాటు

మంచాల: మండల పరిధి బోడకొండ గ్రామంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో వీధిలైట్లను ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొర్ర పాండు బుధవారం తెలిపారు. గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలాజీ దాస్, దేవరాం నాయక్, శ్రీనువాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

మంచాల: పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పార్టీ పీసీసీ సభ్యుడు, ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జాపాల గ్రామానికి చెందిన నోముల నిఖిల్ వైద్యం ఖర్చుల నిమిత్తం.. మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రూ.3లక్షలు ఎల్ఓసీని ఆయన అందజేశారు. ప్రభుత్వం అందజేసే సాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహేశ్‌గౌడ్, ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. వికలాంగుల సంక్షేమం జిల్లా అధికారి సంధ్యారాణిని ఆయన బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. దివ్యాంగుల బడ్జెట్‌ను.. వారికే ఖర్చు చేయాలని కోరారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి, వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిట్టి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి నాగరాజు, ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు శంకర్, శ్రీనివాస్, లింగమయ్యలు పాల్గొన్నారు.

పట్నం బస్టాండ్‌లో దీపావళి వేడుకలు



వేడుకల్లో డిపో మేనేజర్ తదితరులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో దీపావళి వేడుకలను బుధవారం ఆర్టీసీ అధికారులు ఘనంగా నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులతో కలిసి బస్టాండ్‌లో ముగ్గులు వేసి, దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా డీపో మేనేజర్ వెంకటనర్సప్ప ప్రయాణికులు, ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బస్టాండ్ మేనేజర్ దుశ్శాసన్, ఏడీసీ సదానందం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



ఆమనగల్లు: విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ప్రమిదలు



బాణసంచా దుకాణం వద్ద కొనుగోలు చేస్తున్న ప్రజలు

దీపావళి సందడి

దీపావళి వేడుకను ఘనంగా జరుపుకొనేందుకు ప్రజలు సమాయత్తమయ్యారు. గురువారం పండుగ నేపథ్యంలో బుధవారం మార్కెట్లలో సందడి నెలకొంది. పూలు, పండ్లు, ప్రమిదలు, దొంతులు, స్వీట్లు, బొమ్మలు, టపాకాయల కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడాయి. కొనుగోలుదారులతో ఆయా దుకాణాలు కిటకిటలాడాయి. కాగా.. దివ్వెల పండుగ సందర్భంగా సరకుల ధరలు అమాంతం పెరిగినా.. కొనుగోలు చేసేందుకు ప్రజలు ఏమాత్రం వెనుకాడటం లేదు. ముఖ్యంగా టపాకాయల ధరలు ఆకాశాన్నంటినా.. జోరుగా కొనుగోలు చేశారు.

–ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు

నిధులు లేక నిలిచిన నిర్మాణం

- రూ.50 లక్షలతో 2023లో పనులు ప్రారంభం
- ఎనిమిదేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం
- సౌకర్యాల లేమితో ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు



అసంపూర్తిగా నిలిచిపోయిన ఎంపీడీవో కార్యాలయ భవనం

కడ్తాల్: మండల కేంద్రం కల నెరవేరినప్పటికీ.. సౌకర్యాల లేమితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నూతన మండలముగా ఏర్పడి సుమారు ఏనిమిది ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ ప్రభుత్వ కార్యాలయ భవనాలు లేక ఇక్కట్లు పడుతున్నారు. జిల్లాల ఏర్పాటు, మండలాల పునర్విభజనలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 2016లో రంగారెడ్డి జిల్లాలో కలిసిన కడ్తాల్ గ్రామాన్ని.. మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. కానీ.. వసతులు కల్పించడంలో పాలకులు విఫలం అయ్యారు. సుదీర్ఘ కాలం అనంతరం 2023 సెప్టెంబర్‌లో రూ.50 లక్షలతో ఎంపీడీఓ భవన నిర్మాణానికి భూమి పూజ చేసినప్పటికీ.. నిధుల లేమితో గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్‌తో పనులు నిలిచిపోయాయి.

ఇరుకు గదుల్లో..

సుమారు ఎనిమిదేళ్లుగా ఎంపీడీఓ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. అరకొర వసతులు, ఇరుకు గదుల్లో ఈజీఎస్, మండల పరిషత్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో అధికారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి సరైన వేదిక లేక.. రేకుల షెడ్డులో కొనసాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు దృష్టి సారించి, భవన నిర్మాణ పనులు పూర్తిచేయించి, వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తి చేయించండి..



మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయానికి సొంత భవనం లేక అధికారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరగా పూర్తిచేయించి, వినియోగంలోకి తేవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ గౌరవ అధ్యక్షుడు, కడ్తాల్

ప్రతిపాదనలు పంపించాం



ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి గత ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వరకు పనులు జరిగాయి. నిధులు లేక నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇప్పటి వరకు గ్రౌండ్ ఫ్లోర్ వరకు పూర్తయింది. అదనపు నిధుల గురించి, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అవి మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– దార్ల పరమేశ్, పీఆర్ ఏఈ, కడ్తాల్

పీఎంజేజేబీవై బీమాను వినియోగించుకోండి



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మేనేజర్ తదితరులు

తలకొండపల్లి: ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ వెల్జాల్ బ్రాంచ్ మేనేజర్ వి.జిమ్ జోష్ అన్నారు. మండల పరిధి వెల్జాల్‌కు చెందిన గుంత శ్రీనివాస్ ఎస్‌బీఐ సీఎస్‌పీ ద్వారా ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన తీసుకున్నాడు. కొద్ది రోజుల క్రితం ఆయన అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి భార్య నామినీ చెన్నమ్మకు బుధవారం వెల్జాల్‌లో రూ.2 లక్షల చెక్కును మేనేజర్ అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. బ్యాంకు ప్రతి ఖాతాదారుడు ఏటా రూ.436 చెల్లించి, పీఎంజేజేబీవై బీమాను తీసుకోవాలని సూచించారు. బీమా పొందిన వ్యక్తికి సాధారణ మరణం సంభవిస్తే.. రూ.2 లక్షలను సదరు వ్యక్తి కుటుంబానికి అందుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు బ్యాంకులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నాగరాజు, అకౌంటెంట్ కిరణ్ కుమార్, సీఎస్‌పీ ప్రతినిధి రాఘవేంద్ర చారి, హరీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి

మున్సిపల్ ఛైర్ పర్సన్ స్రవంతి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఛైర్ పర్సన్ స్రవంతి

ఇబ్రహీంపట్నం: సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ కప్పరి స్రవంతి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ×ఆత్మరక్షణ– శిక్షణ₹ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. సమాజంలో ఎటువంటి సంఘటనలు చోటుచేసుకున్నా ధైర్యంగా ఎదుర్కొనేందుకు ఇలాంటి స్వీయ రక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. దీనిని సద్వినియోగం చేసుకుని, మెళుకువలను నేర్చుకొని తమకు తాము రక్షణ పొందాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని మౌలిక వసతులను విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన తరగతి గదులు, ఆట స్థలం ఏర్పాటుకు కృషిచేస్తామని స్రవంతి హామి ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్, కరాటే మాస్టర్ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా హయాంలో విద్యుత్ చార్జీలు పెరగలే..

- పది నెలల్లో వేల కోట్ల భారం మోపేందుకు కాంగ్రెస్ యత్నం
- విద్యుత్ చార్జీలను అడ్డుకుంది బీఆర్ఎస్ పార్టీ
- పీఏసీఎస్ ఛైర్మన్ పాండు యాదవ్



సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

మహేశ్వరం: బీఆర్ఎస్ హయాంలో ఏనాడు విద్యుత్ చార్జీలు పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన పది నెలల కాలంలోనే రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ భారం మోపేందుకు యత్నించిందని పీఏసీఎస్ ఛైర్మన్ మంచె పాండు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు అన్నారు. చార్జీల పెంపు నిలుపుదల నేపథ్యంలో బుధవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలపై విద్యుత్ భారం మోపకుండా అడ్డుకుంది బీఆర్ఎస్ పార్టీనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చార్జీల పెంపు ప్రతిపాదనలను సిద్ధం చేయగా.. చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ.. బీఆర్ఎస్ పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని, ఈఆర్‌సీని ఒప్పించగలిగిందని వెల్లడించారు. ప్రజలకు తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహేశ్వరం పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్లు బాలయ్య ఉన్నారు.

బీఆర్ఎస్ నేతృత్వంలోనే పెరిగాయి..

- అబద్ధాలు మాట్లాడుతున్న కేటీఆర్: కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: బీఆర్ఎస్ హయాంలోనే ఇష్టానుసారంగా కరెంట్ చార్జీలు పెంచి, ఆ నెపం కాంగ్రెస్‌పై వేయడం దారుణమని ఆ పార్టీ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, యూత్ మాజీ అధ్యక్షుడు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్ విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. కేసీఆర్ పాలనలో ప్రజలపై రూ.20 వేల కోట్ల కరెంట్ చార్జీల భారం మోపారని ఆరోపించారు. ఇప్పుడు కేటీఆర్ వచ్చి అబద్ధాలు మాట్లాడుతూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. డిస్కం లెక్కలతో వాస్తవాలు బయటపడ్డాయన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఉచిత విద్యుత్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తుండటంతో ఓర్వలేని వారు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్, కేసీఆర్‌లను తెలంగాణ ప్రజలు మర్చిపోయేలా సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఉందని కొనియాడారు.

పేదల భూముల జోలికొస్తే ఊరుకోం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కందుకూరు: పేదల భూముల జోలికి వస్తే ఉపేక్షించేది లేదని సీపీఎం నాయకులు బుట్టి బాల్‌రాజ్, బి.శ్రీనివాస్, ఎం.యాదయ్య హెచ్చరించారు. మండల పరిధి నేదునూరులో సర్వే నంబర్ 154 ఇనాం భూమిలో చేపట్టిన భూ పోరాటం బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 40 సంవత్సరాలుగా ఆ సర్వే నంబర్‌లోని 1.35 ఎకరాల భూమిలో హరిజనులు సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వారికే హక్కు ఉందని తెలిపారు. ఎలాంటి ఫైల్ నంబర్ లేకుండా ఆ భూమిని వెంకట్‌రెడ్డి పేరుపై రికార్డులు మార్చడం అధికారుల తప్పిదమేనని స్పష్టంచేశారు. మాజీ సర్పంచ్ లింగారెడ్డి.. ఇష్టానుసారంగా రికార్డులు మార్పించారని ఆరోపించారు. అధికారులు వెంటనే విచారణ జరిపి, వెంకట్‌రెడ్డి పేరును తొలగించి దళితుల పేరిట మార్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుమార్, స్థానికులు జంగయ్య, చెన్నయ్య, నరసింహ, యాదయ్య, రాజయ్య, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సమగ్ర కుటుంబ సర్వే

- ఎవరికీ ఇబ్బంది కలగకుండా సమాచారం సేకరించాలి
- సర్వే ఉద్దేశం ప్రజలకు వివరించాలి
- ఎంపీడీఓలు కుసుమమాధురి, సుజాత, ప్రత్యేకాధికారులు
- మండల కేంద్రాల్లో ఎన్యుమరేటర్లకు శిక్షణ



కడ్తాల్: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాత



ఆమనగల్లు: శిక్షణలో మాట్లాడుతున్న కమిషనర్ వసంత

ఆమనగల్లు/కడ్తాల్/యాచారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమాచారం సేకరించాలని మండల అధికారులు అన్నారు. బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలోని రైతువేదికలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) గురించి ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుజాత, మండల ప్రత్యేక అధికారి రామేశ్వరిదేవి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా దిశానిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. నవంబర్ మొదటి వారంలో చేపట్టే సర్వేలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమాచారం సేకరించాలని సూచించారు. తొలుత ఇంటింటికీ వెళ్లి సర్వే ప్రాధాన్యత గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేలో వివరాలు నమోదు చేయాలని వెల్లడించారు. అనంతరం ఫారంలో నమోదు చేయాలని పేర్కొన్నారు. సర్వే అనంతరం పూర్తి వివరాలతో కూడిన స్టిక్కర్‌ను ఇంటి గోడపై అతికించాలని స్పష్టంచేశారు. సర్వే ఆధారంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. తహసీల్దార్ ముంతాజ్, ఎంపీఓ విజయ్‌కుమార్ పాల్, ఏపీఎం రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర సర్వేపై ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి ఆదిలక్ష్మి, ఎంపీడీఓ కుసుమమాధురి, తహసీల్దార్ లలితలు.. సర్వే గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పరిధి జీపీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాచారంలో..

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పక్కాగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎన్యుమరేటర్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నవంబర్ 6 నుంచి ప్రారంభమయ్యే సమగ్ర సర్వేను సవివరంగా చేయాలని సూచించారు. సమగ్ర వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు ఎన్యుమరేటర్లకు సహకరించి, నింబంధనల ప్రకారం వారు అడిగే వివరాలను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, మండల పంచాయతీ అధికారి శ్రీలత, ఏఎస్ఓ కవిత, ఎంఈఓ పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ప్రభుత్వం చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి ముత్యాలు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపై అంగన్‌వాడీ, ఆశ, జీపీ కార్యదర్శులతో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారితో పాటు ఎంపీడీఓ శ్రీకాంత్, తహసీల్దార్ నాగార్జున, ఎంపీఓ రఘులు మాట్లాడారు. 76 అంశాలతో కూడిన ప్రశ్నావళిని ఏ విధంగా పూరించాలని, ఏయే ప్రశ్నలు అడగాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐలు మంజుల, శ్రవణ్, కార్యదర్శి, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: ప్రభుత్వ ఆదేశాల మేరకు కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి సుజాత అన్నారు. మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్ వాడీ వర్కర్లకు సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తప్పులు లేకుండా సర్వేను నిర్వహించాలని సూచించారు. అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాల శంకర్, తహసీల్దార్ వెంకట ప్రసాద్, ఎంపీఓ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి..



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

ఇబ్రహీంపట్నం: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు అన్నారు. బుధవారం పట్నం ఇందు కళాశాలలో కులగణనకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నవంబర్ 1 నుంచి 3వ తేది వరకు ఇళ్ల జాబితాను గుర్తించి, 6 నుంచి ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ కులగణనకు సంబంధించి సుమారు 74 ప్రశ్నలను ఏ విధంగా అడగాలి, ఎలా డాటాను ఆన్‌లైన్‌లో పొందుపరచాలో వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నవీన్‌కుమార్, ఎంపీడీఓ వెంకటమ్మ, ట్రైనింగ్ టీఓటి రాజ్‌కుమార్, జెడ్పీఎస్ఓ కృష్ణారెడ్డి, డిప్యూటీ ఎస్ఓ పునవర్‌లు తదితరులు పాల్గొన్నారు.